ప్రజాశక్తి
ఆదివారం 19 మే 2024
5
విజయనగరం

మన్యంలో భారీవర్షం

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

మన్యం జిల్లాలో పలుచోట్ల శనివారం సాయంత్రం భారీవర్షం కురిసింది. సాయంత్రం ఐదు గంటల వరకు సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించగా, తరువాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు ఏర్పడ్డాయి. పార్వతీపురంలో ఉరుములు, పిడుగులతో ఏకధాటిగా గంటకు పైగా భారీవర్షం కురిసింది. ఈ వర్షంతో ప్రధాన రహదారితోపాటు, పలు వీధులు జలమయం అయ్యాయి. మక్కువ మండలంలో గంటపాటు వర్షంకురిసింది.

వీరఘట్టం : మండలంలో ఉదయం నుండి ఎండ వేడిమి తట్టుకోలేక అల్లాడిపోతున్న తరుణంలో ఆకాశంలో నల్లటి మబ్బులు ఒక్కసారి ఏర్పడ్డాయి. గాలులు, మెరుపులతో వర్షం కురిసింది. వర్షం పడటం వల్ల కొంత ఊరటనిచ్చిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణా ఎంసెట్ ఫలితాల్లో..

సత్తాచాటిన మన విద్యార్థులు

- ఇంజినీరింగ్‌లో జ్యోతిరాదిత్య, శ్రీనిధికి 1, 10వ ర్యాంకులు
- అగ్రికల్చర్, ఫార్మసీలో రాధాకృష్ణకు 2వ ర్యాంకు

ప్రజాశక్తి-పాలకొండ, కొమరాడ, బలిజిపేట

తెలంగాణ రాష్ట్ర ఎంసెట్ ఫలితాల్లో విజయనగరం ఉమ్మడి జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఇంజినీరింగ్ విభాగంలో 1, 10వ ర్యాంకులు, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీలో 2వ ర్యాంకు సాధించి అందరితోనూ అభినందనలు అందుకున్నారు.

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం యరకారాయపురానికి చెందిన సతివాడ జ్యోతిరాదిత్య తెలంగాణ ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించాడు. జ్యోతిరాదిత్య కుటుంబం శ్రీకాకుళంలో నివాసం ఉంటోంది. పదో తరగతి వరకు విజయవాడలోని కెకెఆర్ గౌతమ్ స్కూల్లోను ఇంటర్ విజయవాడ నారాయణ జూనియర్ కాలేజ్‌లో చదువుకున్నాడు. ఇంటర్‌లో 953 మార్కులు సాధించాడు. జెఇఇ మెయిన్స్‌లో 116వ ర్యాంకు సాధించాడు. తండ్రి మోహన్ రావు ఎచ్చెర్లలో సాంఘిక సంక్షేమ శాఖలో ఉద్యోగి, తల్లి హైమవతి శ్రీకాకుళం ఆర్టీసీ డిపోలో ఉద్యోగి. తమ కుమారుడికి మొదటి ర్యాంకు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

అగ్రికల్చర్ అండ్ ఫార్మసీలో రాధాకృష్ణకు 2వ ర్యాంకు

బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామం పాకాల వీధికి చెందిన దాసరి రాధాకృష్ణకు అగ్రికల్చరల్ ఫార్మసీలో రెండోర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు నారాయణరావు, కృష్ణవేణి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాధాకృష్ణ ఒకటి నుంచి ఏడో తరగతి వరకు బొబ్బిలిలోని శ్వేత చలపతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలోనూ, 8 నుండి 10 వరకు విశాఖలోని నారాయణ కాలేజీలోనూ, ఇంటర్ రాజమండ్రి తిరుమల కళాశాలలో చదువుకున్నాడు. నారాయణరావుకు ముగ్గురు కుమారులు కాగా, పెద్దకుమారుడు బెంగుళూరులోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, రెండో కుమారుడు డిగ్రీ చదువుకున్నాడు. మూడోకుమారుడు రాధాకృష్ణ ర్యాంకు సాధించాడు.

శ్రీనిధికి స్వీట్ తినిపిస్తూ అభినందిస్తున్న కుటుంబ సభ్యులు

శ్రీనిధికి పదో ర్యాంకు

కొమరాడ మండలం దళాయిపేట గ్రామానికి చెందిన ధనుకొండ శ్రీనిధి తెలంగాణ ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగంలో పదో ర్యాంకు సాధించింది. ఈమేరకు ఎంసెట్ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఆమె తల్లిదండ్రులు ధనుకొండ శ్రీనివాసరావు, సుశీల ఇద్దరూ ఉపాధ్యాయులే. శ్రీనివాసరావు నెల్లిమర్ల మండలం సారిపల్లి జెడ్‌పి హైస్కూలులో పనిచేస్తున్నారు. వీరు ప్రస్తుతం విజయనగరంలోని పూల్‌బాగ్ కాలనీలో నివాసముంటున్నారు. వీరి రెండో కుమార్తె శ్రీనిధి. ఇంటర్ విశాఖలోని శ్రీచైతన్య కళాశాలలో చదువుతోంది. సిబిఎస్ఇలో 490/500 మార్కులు సాధించిన సంగతి తెలిసిందే. శ్రీనిధి ఇప్పటికే జెఇఇ మెయిన్స్‌లో ఆలిండియాలో ఓపెన్ కేటగిరిలో 261 ర్యాంకు సాధించగా, ఒబిసి కేటగిరిలో 35వ ర్యాంకు సాధించింది. జెఇఇ మెయిన్స్ బి.ఆర్క్ విభాగంలో 1వ ర్యాంకు కూడా సాధించింది. తాజాగా ఎంసెట్‌లో పదో ర్యాంకు రావడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె జెఇఇ అడ్వాన్సుకు ప్రిపేర్ అవుతోంది. శ్రీనివాసరావు,సుశీల దంపతుల ప్రథమ కుమార్తె ధనుకొండ సాయి సుదీప్తి కర్నూలు ట్రిపుల్ ఐటిలో బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది.

హేమంత్‌కు 20వ ర్యాంకు

విజయనగరంటౌన్ : తెలంగాణ ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగంలో విజయనగరానికి చెందిన అల్లు హేమంత్ 20వ ర్యాంకు సాధించాడు. హేమంత్ ఇటీవల విడుదలైన జెఇఇ మెయిన్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 277వ ర్యాంకు, ఒబిసి విభాగంలో 38వ ర్యాంకు సాధించాడు. విశాఖలోని ప్రయివేటు కళాశాలలో ఇంటర్ పూర్తిచేశాడు. హేమంత్ తండ్రి ఎవిఎస్ నాయుడు నగరంలోని కలాం కళాశాల డైరెక్టర్ కాగా, తల్లి రాజేశ్వరి ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు.

నిరసన తెలుపుతున్న జిందాల్ కార్మికులు

జిందాల్ కార్మికుల నిరసన

అక్కడే వంటావార్పు

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ పరిశ్రమ అక్రమ లాకౌట్‌ను నిరసిస్తూ కార్మికులు పరిశ్రమ గేటు వద్ద రెండోరోజు నిరసన కొనసాగించారు. అక్కడే మధ్యాహ్నం వంటావార్పు చేపట్టారు. వెంటనే పరిశ్రమను తెరిపించి ఇక్కడే పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సంఘీభావం ప్రకటించారు. పరిశ్రమ లే ఆఫ్ ప్రకటించటంపై కార్మికుల ఆందోళన చెందనవసరం లేదని, యాజమాన్యంతో చర్చలు జరిపి పరిశ్రమ తెరిపించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్మికులకు బేషరతుగా పని కల్పించాలని యాజమాన్యం దృష్టి తీసుకెళ్లామని చెప్పారు. సోమవారం నాటికిఏదో ఒకటి తెలుస్తామని చెప్పారన్నారు. ఈ మేరకు జిందాల్ కంపెనీ డిజిం గోపాలకృష్ణతో చర్చించినట్లు తెలిపారు. కార్మికులకు న్యాయం జరిగేంత వరకు తాము అండగా ఉంటామని చెప్పారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా నాయకులు గాడి అప్పారావు మాట్లాడుతూ కంపెనీ లాకౌట్‌ను ఎత్తివేసి కార్మికులకు, ఉద్యోగులకు ఇక్కడే పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులను, ఉద్యోగులను జాజ్‌పూర్ పంపిస్తే రవాణా సదుపాయంతో పాటు అక్కడ ఉండేందుకు హాస్టల్, భోజన సదుపాయం కల్పించడంతో పాటు అదనపు వేతనం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ టియుసి నాయకులు నెక్కల నాయుడుబాబు, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, టిడిపి నాయకులు తిక్కాన చినదేముడు, బొబ్బిలి అప్పారావు, ఎల్లపు సూరిబాబు, కొరుపోలు అప్పారావు, గోరా పల్లి రాము, జిందాల్ కార్మిక నాయకులు పిల్లా అప్పలరాజు, బాలిపోయిన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిసిఎల్‌కు సిఐటియు వినతి

జిందాల్ కార్మికులకు తగు న్యాయం చేయాలని విజయనగరం డిసిఎల్ సుబ్రహ్మణ్యంకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ వినతిపత్రం అందించారు. కమిషనర్‌కు పంపించి తగు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

కౌంటింగ్‌కు పక్కా ఏర్పాట్లు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఇవిఎంల ఓట్ల లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లను పక్కా ప్రణాళికతో చేపట్టాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని ఉల్లిభద్ర వద్దనున్న ఉద్యాన కళాశాలలోని మూడంచెల భద్రత, ఓట్ల లెక్కింపు కోసం కల్పించాల్సిన భద్రత, వసతుల ఏర్పాట్లను ఎస్‌పి విక్రాంత్ పాటిల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అధిక సంఖ్యలో లెక్కింపు కేంద్రం బయట జనాలు చేరుకొనే అవకాశం ఉన్నందున భారీ వాహనాలను అనుమతించకుండా దారి మళ్లించేందుకు సూచనలు చేశారు. ప్రవేశ మార్గం వద్ద గుర్తింపు కార్డులు కలిగిన సాధారణ ఏజెంట్లను మాత్రమే అనుమతించేలా పోలీస్ సిబ్బంది నియామకం, బారికేడ్లను ఏర్పాటు అంశాలపై కలెక్టర్, ఎస్‌పి చర్చించారు. స్ట్రాంగ్ రూమ్ భద్రతను పరిశీలించిన అనంతరం, కౌంటింగ్ కేంద్రం వద్ద ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలను తీసుకోవాలని అధికారులకు సూచించారు. పార్లమెంట్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు గదులను సిద్ధం చేసి నివేదిక అందజేయాలని డిఆర్ఒ కేశవనాయుడును ఆదేశించారు. కంట్రోల్ రూమ్ నుంచి స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పోలీస్ పహారాను పర్యవేక్షించారు. ఓట్ల లెక్కింపు ముందు రోజు కౌంటింగ్ కేంద్రం సమీపంలోని గ్రామస్తులు బయట ప్రాంతవాసులకు ఆశ్రయం కల్పించవద్దని గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, కంట్రోల్ రూమ్ ఒఎస్‌డి ఆర్.వి.సూర్యనారాయణ, ఆర్‌డిఒ కె.హేమలత, డిఎస్‌పిలు ఎస్.ఆర్.హర్షిత, జి.వి.కృష్ణారావు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో జెఎన్‌టియు స్ట్రాంగ్‌రూమ్ వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఎఎస్‌పి అస్మాఫర్హీన్

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన ఎఎస్‌పి

విజయనగరం కోట : ఎన్నికల ఇవిఎంలను భద్రపర్చిన జెఎన్‌టియు, లెండీ కళాశాలల్లోని స్ట్రాంగ్ రూమ్‌లను ఎఎస్‌పి అస్మాఫర్హీన్ శనివారం పరిశీలించారు. అక్కడ ఏర్పాటుచేసిన మూడంచెల భద్రతను పరిశీలించి జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

డిఇఇ సెట్‌కు హాల్ టిక్కెట్లు జారీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 24న డిఇఇ సెట్ సీతం కళాశాల సమీపాన ఐకాన్ డిజిటల్ లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరుగుతుందని డిఇఒ ప్రేమ్‌కుమార్ తెలిపారు. మేరకు విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను http://cse.ap.gov.in వెబ్‌సైటు నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. పరీక్ష సమయానికి ఒక గంట ముందుగా హాల్ టికెట్ తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకొని పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని డిఇఒ తెలిపారు.

పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

పాదముద్రల పరిశీలన

ప్రజాశక్తి-భోగాపురం

విమానాశ్రయం నిర్మాణ సమీపంలోని అనుమానస్పదంగా ఉన్న చిరుత పులి పాదముద్రలను అటవీ శాఖ అధికారులు శనివారం ఉదయం పరిశీలించారు. చేపలకంచెరు పంచాయతీ దిబ్బల పాలెం సమీపంలో చిరుత పులిని చూసినట్లు ఇద్దరు యువకులు చెబుతున్నారు. కానీ అటవీ శాఖ అధికారులు మాత్రం ఈ ప్రాంతంలో పులుల సంచారం ఉండకపోవచ్చునని చెప్పారు. కానీ చిరుత పులి కచ్చితంగా పిల్లలతో కలిసి సంచరిస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు. పాద ముద్రలు కూడా చిరుత పులివేనని అంటున్నారు. అనుభవం ఉన్న అటవీ శాఖ అధికారులను పిలిపించి నిగ్గు తేల్చాలని గ్రామస్తులు అంటున్నారు. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే పులులకు సంబంధించిన కదలికలు తెలిసే అవకాశం ఉందని అంటున్నారు. ఈ విషయంపై అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరుతున్నారు. చిరుత పులి వ్యవహారం చుట్టుప్రక్కల గ్రామాలకు తెలియడంతో మరింత ఆందోళన చెందుతున్నారు.

24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 24 నుంచి జూన్ మూడో తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డిఆర్ఒ జి.కేశవనాయుడు తెలిపారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో శనివారం జరిగింది. ఈ సమావేశంలో డిఆర్ఒ మాట్లాడుతూ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పార్వతీపురం డివిఎంఎం, సాలూరు, పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. 659 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, పరీక్ష కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, తాగునీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని, తదనుగుణంగా బస్సులు నడపాలని ఆయన చెప్పారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పరీక్షల పేపర్లు నిర్దేశిత కేంద్రాలకు పంపించుటకు తగు ఏర్పాట్లు చేయాలని పోస్టల్ శాఖను కోరారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు పక్కాగా ఉండాలని పోలీసు శాఖకు సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పార్వతీపురం మన్యం డిఆర్ఒ కేశవనాయుడు

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 384 మంది

జిల్లాలో ఓపెన్ స్కూల్ పరీక్షలకు 384 మంది హాజరు కానున్నారని డిఆర్ఒ తెలిపారు. పార్వతీపురం కెవిఎం పాఠశాలలో ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు పార్వతీపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతాయని, 288 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ఆయన చెప్పారు. ఓపెన్ స్కూల్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. ఈ సమావేశంలో పరీక్షల సహాయ కమిషనర్ సుధాకర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం.వినోద్, ఆర్‌టిసి సహాయ మేనేజర్ బడి కృష్ణమూర్తి, సబ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, పోస్టల్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

21న అండర్-16 క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 21న అండర్ -16 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2008 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఒరిజినల్ ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువపత్రం, గత మూడేళ్ళ స్టడీ సర్టిఫికెట్‌లు తీసుకొని రావాలన్నారు. సంబంధిత తేదీల్లో ఉదయం 6.30 గంటలకు వైట్ డ్రెస్, సొంత కిట్ తో హాజరు కావాలని కోరారు.

ఎవరు గెలుత్తారో..!

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ఏరా అప్పన్నా...! మొన్న మనం ఓట్లేశాం కదా ఎవరు గెలుస్తారంటావ్...!

ఏమోరా చిట్టిబాబు యవులు ఎవరికి గుద్దేశారో అర్థం కావడం లేదు..!

అవునవును... చాలా మంది నీలాగే సెప్తున్నారు. ఓటర్ల నాడి పట్టలేకపోతున్నారట నాయకులు కూడాను. సరేగానీ, ఇంతకీ మన అభ్యర్థి గెలుస్తాడంటావా? అప్పన్నా....!

అదేరా? డబ్బులు పంపకాల్లో తేడాలు వచ్చాయట. రెండు పార్టీల వారూ ఒక్కో దగ్గర ఒక్కోలాగ పంచారట.

ఓస్... ఊరుకోరా! డబ్బులు తీసుకున్నోళ్లంతా ఓట్లేసేత్తారా యేటీ. అంత అమాయకులెవరున్నారు ఈరోజుల్లో... కాకపోతే మరీ తెలీనోళ్లు అటు ఇటు సర్ధుబాబు చేస్తారు తప్ప డబ్బులిచ్చారని అభిమానించే పార్టీకి యతిరేకంగా గుద్దేస్తారనుకుంటున్నావేటి కొంపదీసి.

ఔనంటావా? అలాగే ఉంది మరీ... ఆ సూరమ్మకి అటోలు ఇటోలూ ఇద్దరూ బలవంతంగా డబ్బులు ఇచ్చారట. ఈ విషయం అందరికీ తెలిసిపోవడంతో ఇప్పుడు ఆవిడను ఇరు పార్టీ వాళ్లూ నమ్మడం లేదు.

డబ్బులు తీసుకుంటే అలాగే ఉంటది మరీ...

సరేగానీ రాష్ట్రంలో సెంద్రబాబు వస్తాడా? ఈసారి... మరోసారి జగన్‌కి అవకాశముంటుందంటావా?

ఏం సెప్తాంరా బాబు... యవులకి నచ్చినచ్చిట్టు వాళ్లే చెప్తంద్రు. ఇప్పుడు యవలితోనూ మాట్లాడలేకపోతున్నాం. ఆ తవిటయ్య లేడూ... సెంద్రబాబు గెలుస్తాడంటే వాడికి కోపం. మళ్లీ జగన్ పెబుత్తమే వత్తాదంటే సాంబగాడు అస్సలు ఊరుకోవడం లేదు. ఎవలి అంచనాలు వారివి.

ఇంకా పేపర్లోళ్లూ, టీవీ వాళ్లు సర్వేలు గట్రా చేయడం లేదా? ఏటి?

ఎందుకు సెయ్యరూ... ఆలూ కూడా ఆ సంస్థలు అభిమానించే పెబుత్వాలే గెలుస్తాయని చూపిస్తున్నారు? కాలం అంతా మారిపోయింది. ఎవులి డబ్బా వాళ్లే కొట్టుకుంటున్నారు.

సరేగానీ జగన్ పెబుత్తం ఇచ్చిన పింఛన్లు, అమ్మఒడి, ఆసరా చేయూతతోపాటు ఇతర పథకాలు తీసుకున్నవారు తిరిగి జగన్‌కి వెయ్యరంటావా?

ఎందుకెయ్యరూ... ఏస్తారు. కానీ, అదే పథకాలను కొనసాగిస్తూనే కొంచెం డబ్బులు కూడా పెంచుతానని సెంద్రబాబు సెప్పాడు కదా? అన్నట్టు సూపర్ సిక్స్ అంటూ ఆ పార్టీ నాయకులు బాగానే ప్రసారం చేశారు కదా.

ఆ మాటకొస్తే జగన్ మాత్రం పెంచుతానని సెప్పలేదా? ఏటి?

ఈసారి ముసలోలు. ఆడోళ్లు అందరూ ఫ్యానుకి గుద్దేశారట నిజమే అంటావా?

ఔవునవును... ఆలందరూ ప్యానుకి గుద్దేస్తే... ఉద్యోగులు, యువకులు సైకిల్‌కి గుద్దేశారు.

ఇదీ ఈ వారం పబ్లిక్ టాక్. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈనెల 13న ముగిసింది. మరుచటి రోజు నుంచి అభ్యర్థులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు గ్రామం, బూత్ స్థాయిలో పోలైన ఓట్లు, అందులు తమకు అనుకూలంగా ఉన్నవి. ప్రతికూలంగా ఉంటాయనుకున్నవి లెక్కిస్తున్నారు. ఎవరి దీమాలు వారు వ్యక్తం చేస్తున్నప్పటికీ, ఓటమి భయం కూడా అందర్నీ వెంటాడుతోంది. మరోవైపు సాధారణ ప్రజల్లో కూడా ఎన్నికల్లో గెలుపోటములపై సర్వత్రా చర్చనడుస్తోంది. వారి మనోగతాలను, స్నేహితులు, బంధువుల అభిప్రాయాలను ఆఫీసులు, దుకాణాలు, బజార్లు, హోటళు లో జనం చర్చించుకుంటున్నారు. మచ్చుకి కొన్ని పరిశీలిస్తున్నారు.

ఇంతకీ సీపురుబిల్లిలో సత్తిబాబు గెలుస్తాడా? పోతాడా?

ఓమోరా జిల్లాలో అయితే ఎక్కువ మంది టిడిపి వస్తాది అంటున్నారు. కానీ, మినిస్టర్‌గారు అతికష్టమ్మీదైనా గెలుస్తారట. ఎంకట్రావు కూడా గట్టిపోటీయే ఇచ్చాడట. చూడాలి మరి. బొత్స అభివృద్ధి మంత్రం. ఎంకట్రావు రాజకీయ తంత్రం ఎలా ఉంటుందో?

మరి మిగిలిన చోట్ల వైసిపి పరిస్థితి ఎలా ఉంటుంది.

ఈసారి కష్టమేనట మన ఇయ్యానారం జిల్లాలో మినిస్టర్‌తోపాటు మరొకరు గెలిచేసే అవకాశ ఉందట. మిగిలిన అన్నిచోట్లా పోతారని అనుకుంటున్నారు ఎక్కువ మంది జనం.

మరి ఇయ్యానారంలో యవులు గెలుస్తారంటావ్. సొతంత్రంగా పోటీచేసిన మీసాల గీతకు ఎక్కువ ఓట్లు పడితే స్వామి పంటపండినట్టే. లేదంటే రాజుగారి కూతురిదే విజయం అంటున్నారు పబ్లిక్.

నెల్లిమర్లలో సంగతేటంటావ్...

ఎన్నికలకు ముందు టిడిపి ఓట్లన్నీ జనసేనకు పడడం కష్టమని చాలా మంది నోట వినిపించిందిగానీ, టిడిపోళ్లంతా మనస్ఫూర్తిగానే చేశారట. కాబట్టి ఈసారి జనసేనే అంటున్నారు. ఒక వేళ జనసేన ఓడిపోతే టిడిపోళ్లు దెబ్బయ్యడంతోపాటు కులం కార్డు కూడా వైసిపికి బాగా ఉపయోగపడినట్టు లెక్క.

మినిస్టర్‌గారి తమ్ముడు సంగతి ఎలా ఉందో?

ఈసారి కష్టమేనట. ఈ మధ్య చాలా గ్రామాల్లో భూములు, ఇతర సమస్యలపై జనం ఆయన్ని బాగానే నిలదీశారు. గ్రామాలకు గ్రామాలే టిడిపిలోకి ఎల్లిపోయాయట. దత్తిరాజేరు మండలంలో భోజరాజపురపోళ్లు తమ గ్రామానికి రోడ్డు వేయలేదని ఏకంగా ఓటింగే బహిష్కరించారు.

ఔనా..? ఐతే కష్టమే మరి.

కురుపాంలో పుష్పశ్రీవాణి పరిస్థితి ఎలా ఉందంటావ్.

ఆవిడైతే ఈసారి కష్టమే అంటున్నారు. పతిపక్షంలో వున్నప్పుడు బాగానే పనిచేసిందట. అధికారంలోకి వచ్చాకే జనానికి బాగా దూరమైపోయిందట. అందుకే ఆమెను మరోసారి ప్రతిపక్షంలో పెడతారని అనుకుంటున్నారు జనం. టిడిపికి అవకాశాలు ఉన్నాయట. కానీ, అక్కడ సిపిఎంకి ఆదరణ పెరిగిందని చెప్పుకుంటున్నారు.

సాలూరులో దొరగారి పరిస్థితి ఏమిటో....?

టిడిపి అభ్యర్థి సంధారాణి ఈసారి గట్టిపోటీయే ఇచ్చారట. ఓట్లు బాగానే వస్తాయంటున్నారు. కానీ, టిడిపోళ్లు అనైక్యత, గ్రూపులే దొరగారికి కొండంత అండ. కాబట్టి టిడిపిలోని ఆ బలహీనతలే తిరిగి దొరగారిని అందలమెక్కిస్తాయని అన్నిచోట్ల ఇనిపిస్తున్నమాట.

రాజాం, బొబ్బిలి ఎలా ఉంటాయి?

అప్పలనాయుడు నువ్వు సెప్పు..

ఏం సెప్తాం కిట్టమూర్తి... బొబ్బిలి ఐతే ఈసారి ఖాయంగా టిడిపి వస్తాదని చాలా మందినోట ఇనిపిస్తాంది.రాజాం కూడా కాస్త అటు ఇటులో టిడిపియే నని నేను అనుకుంటున్నాను.

ఎస్.కోటలో గ్రూపుల గోల ఎలాంటి తీర్పునిస్తుందో మరీ....

అక్కడ రాజకీయాలు ఎప్పుడూ తికమకే. ఇరు పార్టీలకు చెందిన ఓట్లు క్రాస్ ఓటింగ్ పడిందట. ఎమ్మెల్యే ఓటు ఒక పార్టీకి, ఎంపీ ఓటు మరో పార్టీకి వేసుకున్నారట. అతికష్టంమీద లలితమ్మకి అవకాశాలు ఉన్నాయట. టిడిపిలోని క్రాస్ ఓటింగ్ వైసిపికి ఎక్కువగా ఉంటే.మరోసారి కడుబండే.

మరి పార్వతీపురం సంగతి?

ఎలచ్చన్ వరకు తిరిగి వైసిపియే వస్తుందన్న చర్చ ముమ్మరంగానే సాగింది కానీ, విజయచంద్ర బాగానే రాజకీయం చేశాడట. పార్టీలో వెన్నుపోటును ముందే నిలువరించడంతోపాటు వైసిపికి ధీటుగానే ప్రచారం, సమీకరణాలు చేసుకున్నాడట. కాబట్టి అక్కడ ఏ పార్టీకి అయినా ఫుల్ టైట్ అంటున్నారు.

పాలకొండ ఎవరికి అండ అంటావ్..

అక్కడ ఈసారి టిడిపి ఖాయం అనుకున్నారు. కానీ, జనసేనకు సీటిచ్చారు. సీటు పేరుకు జనసేనదైనా అభ్యర్థి టిడిపి వాడే. కాబట్టి గెలిసే అవకాశముంది. కాకపోతే ఇక్కడ గ్రూపు రాజకీయాలపైనే జనం అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లోలోపల పార్టీ నాయకులు దెబ్బ ఎయ్యకపోతే జనసేనకే అవకాశం. ఓడిపోతే సొంత పార్టీ నుంచి దెబ్బపడినట్టే లెక్క అట.

మగువ మనసు గెలిచేదెవరో?

● పురుషుల కన్నా 7వేలకు పైగా మహిళా ఓట్లు నమోదు ● వారు ఎవరికి వేస్తే... వారే విజేత ● మహిళల నిర్ణయం పై సర్వత్రా ఉత్కంఠ

ప్రజాశక్తి - జామి

ఎన్నికలు పోలింగ్ ముగిసి, ఐదు రోజులు కావస్తుంది. ప్రజల అభిప్రాయం ఇవిఎంలలో భద్రంగా ఉంది. కానీ ఎన్నికల ఫలితాలపై ఎవరి ధీమా.. వారు వ్యక్తం చేస్తున్నారు. గెలుపు మాదంటే..మాది అంటూ అంచనాల్లో తల మునకలవుతున్నారు. ప్రజల కూడా సమయం దొరికిన ప్పుడల్లా.. ఎన్నికల గెలుపు ఓటముల పైనే చర్చోప చర్చలు. వాస్తవానికి ఎన్నికల ఓటింగ్ సరళి, పరిశీలిస్తే.. ఫలితాలపై మహిళల ఓటింగ్ కీలకంగా మారినట్లు తెలుస్తోంది.

శృంగవరపుకోట కోట నియోజకవర్గంలో ఎస్.కోట, వేపాడ, లక్కవరపుకోట, కొత్తవలస, జామి మండల ంలో 12 పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 2,22,475 ఓటర్లకు గానూ, మహిళలు 1,14,246 మంది ఉండగా,

ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళలు(ఫైల్)

పురుషులు 1,08,227 మంది ఉన్నారు. ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో 85.45 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. ఇందులో 99,724 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకోగా 92,379 మంది పురుషులు ఓటు వేశారు. పురుషులు కన్నా, 7 వేలు పై చిలుక ఓట్లు మహిళలవి పడడం, వారి మద్దతు ఎవరి కన్నదీ తెలియాల్సి ఉంది. ఈ ఓట్లే గెలుపునకు కిలకంగా మారిందని చర్చ సాగుతోంది. జామి మండల కేంద్రంలో 4,077 మంది మహిళల ఓట్లు వేయగా, పురుషులు 3,979 మంది ఓట్లు వేశారు. ఇలా ప్రతీ మండలంలో మహిళలు అధికంగా ఓట్లు వేయడంతో వీరి మద్దతు ఎవరికీ అన్నది చర్చనీయాంశంగా మారింది. వైసిపి పథకాలు కొనసాగాలని మహిళలు తమ పార్టీకి ఓటు వేశారని వైసిపి నాయకులు చెప్పుకోగా, బాబు సూపర్ సిక్స్ పథకాలు నచ్చి వైసిపిని ఓడించేందుకు మహిళలు ఓటు వేశారని టిడిపి అంటుంది. మొత్తానికి మహిళల ఓట్లే గెలుపు ఓటములపై తీవ్ర ప్రభావం చూపుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

మాట్లాడుతున్న జడ్జి రోహిణిరావు

ఆడ పిల్లలను సంరక్షించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

ఆడపిల్లలను సంరక్షించాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణిరావు కోరారు. మండలంలోని మెట్టవలసలో శనివారం జాతీయ మిస్సింగ్ చిల్డ్రన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు మిస్సింగ్ కేసులు ఎక్కువవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను బాగా చూసుకుని చదివించాలని కోరారు. పిల్లలను హింసిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది దీపావల్లి, మహిళలు పాల్గొన్నారు.

కోడ్ ఉంది.. అట్టహాసం వద్దు..

వేపాడ: ఎన్నికల కోడ్ ఉంది.. పండగలను అట్టహాసంగా నిర్వహించొద్దని సిఐ హెచ్ ఉపేంద్ర సూచించారు. మండలంలోని బక్కునాయుడుపేట గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరుపుకొనే పండగ మహోత్సవాలను అట్టహాసంగా కాకుండా సాధాగా నిర్వహించుకోవాలన్నారు. వేదికలను ఏర్పాటు చేసి డాన్స్ బేబీ డాన్స్ వంటి సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించొద్దన్నారు. బాణాసంచా తయారీ, అమ్మకం, కాల్పులు జరపడం కూడా కోడ్ ఉల్లంఘనకే వస్తుందన్నారు. రాజకీయ పార్టీల నాయకులు గ్రామాల్లో ఎటువంటి సభలు సమావేశాలు నిర్వహించకూడదన్నారు. ఇటువంటి నిషేధిత అంశాలన్నీ ఎన్నికల కోడ్ ఉల్లంఘనకే వస్తుందని, వీటిని ఎవరు ధిక్కరించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో వల్లంపూడి ఎస్ఐ కోనేటి రాజేష్, కానిస్టేబుల్ నాయుడు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై సమీక్ష

తెర్లాం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నాడు నేడు ఫేజ్ 2 పనుల పురోగతిపై ఎంఇఒ త్రినాధరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో నాడు నేడు ఫేజ్ 2 పనులకు సంబంధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, సిఆర్‌పిఎస్, ఎంఆర్‌సి సిబ్బందితో ఆయన ఎఇ కిషోర్ కుమార్ చర్చించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఖర్చు చేసిన నగదుకు సంబంధించి బిల్స్ అప్లోడ్ చేయాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ పనుల పూర్తి కోసం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీలను సమన్వయం చేస్తూ తగు విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిబిరం

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని లైబ్రేరియన్ మహేష్ తెలిపారు. శనివారం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు పుస్తకాలు గురించి వివరించారు. గ్రంథాలయానికి వచ్చి మంచి మంచి కథల పుస్తకాలను చదువుకొని విజ్ఞానాన్ని పొంది ఇండోర్ గేమ్స్ కూడా ఆడుకొని వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. దీనికి ముందుగా గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులకు కథలు పుస్తకాలను అందించి బిస్కెట్లను పంపిణీ చేశారు.

వృద్ధాశ్రమంలో రక్తదాన శిబిరం

విజయనగరం టౌన్ : ప్రస్తుతం రక్తం నిల్వలు తక్కువగా ఉన్నాయని, ఆపద సమయంలో రక్తం కావలసిన వారికి తగిన సమయంలో రక్తం సరఫరా జరగవలసిన పరస్థితి ఉందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కెఆర్‌డి ప్రసాద్ రావు తెలిపారు. ఈ దశలో ఆధ్యాత్మిక సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఎటికె వెలుగు వృద్ధాశ్రమంలో శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అత్యవసర రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆనందబాబు (ఐపిఎస్) మాట్లాడుతూ రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అహ్మద్ బాబు, ఏ.టి.కె. కార్యదర్శి ఎం.విజయ భాస్కర్, రెడ్ క్రాస్ ప్రతినిధి ముడిదాపు రాము వాలెంటీర్స్ పి.సుధాకర్, పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైరుతో భూసారం

శృంగవరపుకోట: పచ్చిరొట్ట పైర్లు భూసారం పెంచేందుకు దోహదపడతాయని మండల వ్యవసాయాధికారి రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూసారాన్ని పెంచేందుకు ఉపయోగపడే పచ్చిరొట్ట పైర్లు జనుము, జీలిగ, పిల్లి పెసర మొదలైన పచ్చిరొట్ట విత్తనాలు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. జనుము 10 కేజీల ప్యాకెట్ రూ. 440కు, జీలుగా 10 కేజీల ప్యాకెట్ రూ. 440కు, పిల్లి పెసర 8 కేజీల ప్యాకెట్ రూ. 536కు లభిస్తున్నాయన్నారు. ఆర్‌బికెలకు తమ ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ సిబ్బందికి ఇచ్చి పచ్చిరొట్ట ఎరువులను తీసుకువచ్చినని తెలిపారు.

రేపు పలు ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం

విజయనగరం టౌన్ : ఈనెల 20న సోమవారం ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు 33/11 కెవి తోటపాలెం సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ పనుల నిమిత్తం పలు ప్రాంతాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరి ఒక ప్రకటనలో తెలిపారవు. 11 కెవి సెంట్రల్ బ్యాంక్ ఫీడర్ మీద ఉన్న సెంట్రల్ బ్యాంక్, ట్యాంక్ బండ్ , తోటపాలెం రామాలయం, బ్యాంక్ కాలనీ ఫీడర్ మీద ఉన్న బ్యాంక్ కాలనీ, శ్రీనివాస కాలేజీ , మయూరి జంక్షన్ తదితర ప్రదేశాలకు, బాలాజీ నగర్ ఫీడర్ మీద ఉన్న బాలాజీ నగర్ , వెంకటేశ్వర స్వామి గుడి దగ్గరపలు ప్రదేశములుకు, నాయుడు కాలనీ ఫీడర్ మీద ఉన్న నరసింహనగర్ , నాయుడు కాలనీ, కళ్యాణ్ నగర్ తదితర ప్రదేశాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

హంతకులను వెంటనే అరెస్టు చేయాలి

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో ఈ నెల 10న దళితవాడకు చెందిన ఉత్తరావల్లి సంగం అనే విశ్రాంత ఉద్యోగిని హత్య చేసిన ఘటన హంతకులపై తక్షణమే విచారణ జరిపి అరెస్టు చేసి ఉరితీయాలని రాజాం నియోజకవర్గం దళిత జెఎసి నాయకులు దేబార్కి రామప్పడు, బొత్స బుద్ధుడు, పేకేటి రామారావు, పొండ్రంకి శ్రీనివాసరావు, తేగల మోహనరావు, ఈసరి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం చిన్న శిర్లాంలో మృతుని భార్య నక్షత్రమ్మ, కుమారులు, మాజీ జెడ్‌పిటిసి మంతిని ఉషారాణి కుటుంబ సభ్యులను పరామర్శించారు. హత్యకు సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ హత్య చేసిన వ్యక్తులు ఎంతటి వారైనా పోలీసులు అరెస్టు చేసి, కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు.

ప్రజాస్వామ్య విలువలకు నిదర్శనం : ఎంపిపి

విజయనగరం టౌన్ : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడం ప్రజాస్వామ్య విలువలకు నిలువుటద్దంగా నిలిచాయని ఎంపిపి మామిడి అప్పలనాయుడు, కార్పొరేషన్ వైసిపి ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ అన్నారు. శనివారం కోలగట్ల స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఐదేళ్ల కాలంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందించిన సుపరిపాలనకు నిదర్శనంగా ఆయనకు మద్దతుగా ప్రజానీకం అత్యధికంగా ఓట్లు వేసారని అన్నారు. స్థానికంగా కోలగట్ల వీరభద్ర స్వామి అభివద్ధే ధ్యేయంగా నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిపారని అన్నారు. ఈ ఎన్నికల్లో మరోసారి శాసనసభ్యులుగా గెలుపొంది రాష్ట్రంలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఆలయంలో పురాతన విగ్రహాలు చోరీ

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక గుర్రపు కొనేరులో ఉన్న శ్రీలక్ష్మి నారాయణ స్వామి ఆలయంలో పురాతన విగ్రహాలు చోరీకి గురయ్యాయి. డోలయాత్ర సందర్భంగా శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ఉన్న స్వామివారిని ఊరేగించి గుర్రపు కొనేరులో రాజ వంశీయులు తెప్పోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. గుర్రపు కోనేరు మధ్యలో ఉన్న ఆలయంలోకి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి పురాతన విగ్రహాలను చోరీ చేశారు. భూమిలోను, గోడకు ఉన్న విగ్రహాలను పదునైన పనిముట్లతో తొలగించి చోరీకి పాల్పడ్డారు. పురాతన విగ్రహాలను చోరీ చేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డోలయాత్ర కమిటీ, హిందూ ఉత్సవ సమితి సభ్యులు పోలీసులకు పిర్యాదు చేశారు.

గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా కోశాధికారి మృతి

ప్రజాశక్తి- విజయనగరం కోట

ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం విజయనగరం జిల్లా కోశాధికారి ఉమాశంకర్ మృతి చెందారు. కొద్దిరోజులుగా నిమోనియా షుగర్ వ్యాధులతో ఇబ్బంది పడి మంచానికే పరిమితమయ్యారని శుక్రవారం అత్యవసర చికిత్స కోసం విశాఖపట్నం కెజిహెచ్‌లో జాయిన్ అయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల సమయం లో తుది శ్వాస విడిచారని చెప్పారు. ఉమాశంకర్ మృతి పట్ల జిల్లా జోనల్ అధ్యక్షులు జంగం జోషీ, జిల్లా అధ్యక్షులు గద్దె చిరంజీవి, కార్యదర్శి కోట్ల పైడిరాజు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. జిల్లా సంఘానికి, రాష్ట్ర ఫెడరేషన్‌లో మంచి నాయకులుగా గుంకలాం పరిసర గ్రామ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించి మంచి పేరు తెచ్చుకున్నారని ఆయన మృతి తీవ్ర నష్టాన్ని కలిగించిందని ఆయన ఆత్మకు శాంతి కలగాలని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-బొబ్బిలి

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సి.ఎస్.డి.టి స్వర్ణలత పట్టుకున్నారు. బొబ్బిలి నుంచి పిరిడి వ్యాన్‌తో బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పిరిడి జంక్షన్ వద్ద దాడి చేసి వ్యాన్ పట్టుకుని వేయన్, 66 బస్తాల బియ్యాన్ని సీజ్ చేశారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్వర్ణలత హెచ్చరించారు.

విజయం తథ్యం.. మెజార్టీపైనే ఆలోచన

ప్రజాశక్తి- చీపురుపల్లి

తమ విజయం తథ్యమైందని మెజార్టీపైనే ఆలోచన అంతా అని చీపురుపల్లి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, నాలుగు మండలాల పార్టీ అద్యక్షులతో కలసి స్థానిక నటరాజ్ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1983, 1994 ఎన్నికల్లో ఏ విధమైన ప్రజా స్పందన కనిపించిందో అదే స్పందన ఈ ఎన్నికలలో కూడా స్పష్టంగా కనిపించిందన్నారు. బంగాళాఖాతంలో వైసిపిని కలపకపోతే ఈ రాష్ట్రం అధోగతి పాలైపోతుందని, సంక్షేమంలో కూడా ఒక చేత్తో పది రూపాయలు ఇస్తే మరో చేత్తో వంద రూపాయలు పన్నులు ధరలు పెంచుతున్నాడని జగన్‌మోహన్‌రెడ్డిపై విసుగు చెంది టిడిపికి ప్రజలు పట్టం కట్టేందుకు ముందుకు వచ్చి ఓట్లు వేసారన్నారు. ప్రజలు స్వేచ్ఛగా జీవించే హక్కును జగన్ కాలరాశాడని మైనింగ్, సారా, ఇసుకలో దోచుకోవడం దాచుకోవడమేపనిగా చేసారని ఆరోపించారు. రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ చేతులో పెట్టుకొని ప్రజలను భయభ్రాంతులను చేయడం వల్ల ఈ భూతాన్ని వదిలించుకోవాలని ప్రజలు భావించి పెద్ద ఎత్తున ఓటింగ్ వేశారన్నారు. చంద్రబాబు అధికారంలోనికి వస్తే సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయగలడనే నమ్మకంతో టిడిపి ఓట్లు వేశారన్నారు. జగన్ లండన్ వెలుతూ అధికారులను

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కళా

మాట్లాడుతున్న కళా వెంకటరావు

మభ్యపెట్టడం కోసం తాము గెలిచేస్తామని డాంభికాలు పలికారని చెప్పారు. పైపైన చెప్పిన మాటలే తప్ప అవి జగన్‌మోహన్‌రెడ్డి గుండె నుంచి వచ్చినవి కాదన్నారు. విశాఖపట్నం సముద్రం ఒడ్డున ప్రమాణ స్వీకారం చేస్తామని బొత్స సత్యనారాయణ చెప్పడం చూస్తే అధికారులను భయపెట్టి మిగిలిన పనులు చేయించుకునేందుకేనని స్పష్టమవుతుందన్నారు. ప్రజల ఆగ్రహానికి వైసిపి గురయ్యిందని కూటమి 160 సీట్లు సాధిస్తుందని జోష్యం పలికారు. ఎన్నికలలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, యువత, మిత్ర పక్షాలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

నెల్లిమర్ల : మాట్లాడుతున్న ఎంపిపి అంబళ్ల సుధారాణి, ఎంపిడిఒ రామారావు

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండల సర్వ సభ్య సమావేశం సదాసీదాగా జరిగింది. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలోఎంపిడిఒ జి.రామారావు, ఎంపిపి అంబళ్ల సుధారాణి ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిలు హాజరయ్యారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎటువంటి నిర్ణయాలు, చర్చ జరపకుండా ప్రోటో కాల్ ప్రకారం ముగించారు. ఈ సమావేశంలో తహశీల్దారు డి. ధర్మరాజు, ఇఒపిఆర్‌డి కె.సింహాద్రి తదితరుల పాల్గొన్నారు.

రేగిడి: స్థానిక ఎంపిడిఒ కారాల్యయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి ధార అప్పల నరసమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశంలో ఎన్నికల కోడ్ ఉన్నందున సాదాసీదాగా నిర్వహించారు. గ్రామస్థాయి సమస్యలపై ఎటువంటి చర్చలూ లేకుండా సాదాసీదాగా నిర్వహించి ముగించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావుతో పాటు ఎంపిడిఒ శ్యామలకుమారి, తహశీల్దార్ రాములమ్మ, ఎంఇఒ ఎం వరప్రసాదరావు, ఎపిఎం గోవిందరావు, ఎపిఒ సంకాబత్తుల హరినాథ్, హౌసింగ్ ఎఇ జగన్నాధ రావు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవత పండగలకు ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీలోని నేటి నుంచి గొల్లపల్లి శ్రీదాడితల్లి, పాతబొబ్బిలి శ్రీసరేపోలమ్మతల్లి గ్రామ దేవతలు పండుగల సందర్భంగా పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి చెప్పారు. గ్రామదేవత పండుగల సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు

గ్రామ దేవత పండుగల సందర్భంగా ప్రజలు, భక్తులు ఇబ్బందులు పడకుండా పారిశుధ్య పనులు నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. మున్సిపాలిటీలో అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టి కాలువలు శుభ్రం చేస్తున్నాం. సిరిమానోత్సవం సందర్భంగా దాడితల్లి, సరేపోలమ్మతల్లి సిరిమానోత్సవం వెనుక రెండు పారిశుధ్య కార్మికులతో టీములు ఏర్పాటు చేసి సిరిమాను వెనుక వెళ్లి పారిశుధ్య పనులు చేస్తారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం.

మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి

రెండు ట్యాంకర్లతో తాగునీరు సరఫరా

ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. కుళాయిలతో రెగ్యులర్‌గా తాగునీరు సరఫరా చేయడంతో పాటు రెండు మంచినీటి ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తాం. పాతబొబ్బిలి ప్రజలకు ఒక ట్యాంకర్, గొల్లపల్లి ప్రజలకు మరో ట్యాంకర్‌తో తాగునీరు అందిస్తాం. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చూస్తాం.

సిరిమానోత్సవం విజయవంతానికి చర్యలు

రెండు సిరిమానోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. శ్రీదాడితల్లి, శ్రీసరేపోలమ్మతల్లి సిరిమానోత్సవం జరిగే రోడ్లపై ఉన్న గోతులను పూడ్చుతున్నాం. కాలువలపై ఆక్రమణలు తొలగిస్తాం. రోడ్లపై నిర్మాణ సామగ్రి లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. సిరిమానోత్సవంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులతో చర్చలు జరిపాం.

రెండు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

పాతబొబ్బిలి శ్రీసరేపోలమ్మతల్లి ఆలయం, గొల్లపల్లి శ్రీదాడితల్లి ఆలయాలు వద్ద రెండు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశాం. పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. రెండు గ్రామదేవత పండుగలు విజయవంతం చేసేందుకు ప్రజలు, భక్తులు సహకరించాలని ఆమె కోరారు.

నేటి నుంచి జంట పండగలు

గొల్లపల్లి శ్రీదాడితల్లి, పాతబొబ్బిలి శ్రీసరేపోలమ్మతల్లి గ్రామదేవత పండుగలు నేటి నుంచి జరగనున్నాయి. ఆదివారం దేశతల్లి వారాలు, సోమవారం తోలేళ్ల ఉత్సవం, మంగళవారం సిరిమానోత్సవం నిర్వహించనున్నారు. మూడు రోజులు పండుగలు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది.

వైసిపి జెండా ఎగరడం ఖాయం

ఎంపిపి సుధారాణి శ్రీరాములునాయుడు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి విజయకేతనం ఎగురవేయడం ఖాయమని ఎంపిపి అంబళ్ల సుధారాణి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములునాయుడు అన్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చారని, మెజార్టీ ప్రజలు వైసిపికి ఓటు వేశారని చెప్పారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రి అవుతారని జోష్యం పలికారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగురుతుందని ఎమ్మెల్యేగా బడ్డుకొండ అప్పలనాయుడు విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న ఎంపిపి దంపతులు

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని బైరిపురంలో జరుగుతున్న ఉపాధి పనులను జెఇ నరేంద్ర కుమార్ శనివారం పరిశీలించారు. గ్రామంలోని జగ్గమ్మ చెరువులో రూ.9.70లక్షలతో ఉపాధి పనులు జరుగుతున్నాయి. ఈ పనులలో 27 గ్రూపులతో 296 మంది వేతనదారులు పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా జెఇ ఆకస్మికంగా సందర్శించి పనులు పనితీరును, పనుల సమయంలో వేతన దారులకు తాగునీరు, మెడికల్ కిట్, ఎండ తీవ్రత నుంచి కాపాడుకోవడానికి అందుబాటులో తార్పాన్లతో కూడిన షెడ్లు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. వేతనదారులకు అవి అందుబాటులో ఉండటం, వేతన దారులు కూడా వుంటున్నాయని చెప్పటం పనులు పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వేతన దారులతో జెఇ

మాట్లాడుతున్న జెఇ నరేంద్రకుమార్

నరేంద్ర కుమార్ మాట్లాడుతూ వేతన దారులు అందరూ ఉదయం 6 గంటలు నుంచి 11 గంటలు వరకు అదే విధంగా సాయంత్రం 4 గంటలు నుంచి 6గంటలు వరకు పనులు చేపట్టాలని, వడ దెబ్బకు గురి కాకుండా అందరూ జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బూడు శ్రీనివాసరావు, వేతన దారులు పాల్గొన్నారు.

గొప్పు తవ్వుతున్న రైతులు

నువ్వు రైతులు బిజీబిజీ

వేపాడ: మండలంలో ఈఏడాది ముందుగా వర్షాలు అనుకూలించడంతో నువ్వు పంట వేసిన రైతులు కలుపు మొక్కలు తీసే పనుల్లో భాగంగా గొప్పులు తవ్వే పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఈ తొలకరి పంట రైతులు చేతికి అందితే వరి ఉబాలకు పెట్టుబడులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని, ఇంటి అవసరాలకు కూడా తొలకరి నువ్వు పంట రైతులకు ఉపయోగ పడుతుందని రైతులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్యార్థి దశలోనే ప్రతివిద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని వయోజన విద్య సంచాలకులు సోమేశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాన్ని మనం ఎంత బాగా ఉపయోగి ంచుకుంటే అంత ఉన్నత స్థాయికి చేరుతామని అన్నారు. పుస్తక పఠనం రోజుకు రెండు మూడు గంటలు చదవాలన్నారు. పూర్వ చరిత్రలు, మన సాంప్రదాయాలు, సంస్కృతి తెలుసుకోవాలంటే పుస్తకాలే ఆధారమన్నారు. వేసవి సెలవులను వృథా చేసుకోకుండా ప్రతి ఒక్కరు గ్రంథాలయం కొచ్చి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.లక్ష్మీ మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణ శిబిరాలు జూన్ 7వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాల్లో పిల్లలకు కథలు చెప్పడం, రాయడం వినడం వంటి అంశాలను నేర్పిస్తూ చిత్రలేఖనం, క్రీడలు, తెలుగు, ఇంగ్లీష్ రాయడం, చదవడం నేర్పడం ఉంటుందన్నారు. ఈ ఏడాది కొత్తగా కంప్యూటర్ శిక్షణ కూడా నేర్పిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించి ప్రతిరోజు గ్రంథాలయాలకు పంపించాలని కోరారు

మాట్లాడుతున్న సోమేశ్వరరావు

కార్యక్రమంలో షేక్ గౌస్ బాషా, గ్రంథాలయ సహాయధికారి కె.శ్రీనివాస రావు, సీనియర్ రికార్డు అసిస్టెంట్ ఆచారి పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతికి టిడిపి నివాళి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని తంగుడుబిల్లిలో ఓటు వేయడానికి వచ్చి మృతి చెందిన వృద్ధురాలు పాలూరు పెంటమ్మకు శనివారం టిడిపి నాయకులు గ్రామంలో నివాళులర్పించారు. ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో ఓటు వేయడానికి వచ్చి కుప్పకూలి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో మృతురాలి చిత్ర పటానికి టిడిపి, జనసేన నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, నాయకులు పోతల రాజప్పన్న, ఎంపిటిసి చందక చిన్నం నాయుడు, అవనాపు సత్య నారాయణ, కాళ్ళ రాజ శేఖర్, జన సేన నాయకులు నల్లి చంద్ర శేఖర్, ఎంఎం నాయుడు తదితరుల పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

'చేయూత' కోసం ఎదురు చూపులు

- జమకాని నాలుగో విడత డబ్బులు
- రెండున్నర నెలలుగా ప్రదక్షిణలు
- ప్రభుత్వం మారితేనే నిధులా?

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైఎస్ఆర్ చేయూత సాయం కోసం నగరంలోని మహిళలు ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది మార్చి 7న నాలుగో విడత చేయూత నిధులు విడుదల చేస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కారు. ఈ మొత్తం వరుసగా లబ్ధిదారుల ఖాతాల్లో పడతాయని చెప్పారు. 14 రోజుల పాటు చేయూత నిధుల జమను పండగలా జరపాలని ప్రభుత్వం భావించింది. పోటా పోటీగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రతి మండలంలోనూ సభలు పెట్టారు. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్ మార్చి 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ జారీచేయడంతో చేయూత నిధులు అందజేత ఆగిపోయింది. నిధులు సమకూర్చుకొని చేయూత నిధులు మహిళల ఖాతాల్లో జమ చేయాలనుకునేలోపు షెడ్యూల్ రావడంతో ఏ ఒక్క లబ్ధిదారునికీ నేటికీ పైసా కూడా జమకాలేదు. మార్చి 7న అనకాపల్లి నియోజకవర్గంలో నాలుగో విడత చేయూత నిధుల విడుదలకు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొన్న సిఎం జగన్ మహిళలకు భరోసా ఇచ్చారు. అప్పటి నుంచి డబ్బులు తమ బ్యాంకు ఖాతాలో జమవుతాయని లబ్ధిదారులు ఈ రోజు వరకూ ఆశగా ఎదురుచూసినా ఫలితం లేకపోయింది. వాస్తవానికి 45-60 ఏళ్ల మధ్య వయసు కలిగిన మహిళలకు ప్రభుత్వం ఏటా ఒక్కొక్క మహిళకూ రూ.18,750 చెల్లిస్తోంది. ఇలా మూడు విడతలుగా ప్రభుత్వం చేయూత నిధులు అందజేసింది. నాలుగో విడత నిధుల విడుదల విషయంలో ఎన్నికలు రావడంతో తీవ్రమైన జాప్యం చోటుచేసుకుంది. విజయనగరంలో 50 వార్డుల్లో 11094 మంది మహిళా లబ్ధిదారులకు, రూ.20కోట్ల 80లక్షల 01,285ను ప్రభుత్వం జమ చేయాల్సివుంది. ఈ నాటికీ అవి జమకాకపోవడంతో ఇకరావని మహిళలల్లో ఆందోళన వ్యకమవుతోంది. మళ్లీ ఇదే ప్రభుత్వం వస్తే డబ్బులు జమవుతాయనే భావన వున్నప్పటికీ, ప్రభుత్వం మారితే డబ్బులు రావన్న దిగులు కనిపిస్తోంది. వచ్చే నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపులోపు చేయూత నిధులు జమ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. మరోపక్క రాష్ట్రంలో పోలింగ్ పూర్తవడంతో నాలుగో విడత చేయూత నిధులను ఒకటి, రెండు రోజుల్లో మహిళల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందని ఆయా శాఖాధికారులు మాత్రం చెబుతున్నారు.

డబ్బులు జమయ్యేదెప్పుడో?

ప్రజాశక్తి - వేపాడ

సిఎం జగన్మోహన్‌రెడ్డి చేయూత బటన్ నొక్కి రెండున్నర నెలలు గడుస్తున్నా ఇంత వరకూ మహిళల ఖాతాల్లోకి డబ్బులు జమ కాలేదు. మండలంలోని జగనన్న చేయూత లబ్ధిదారులు సుమారు 3,918 ఉన్నారు. మార్చి 7న బటన్ నొక్కినా డబ్బులు జమచేయడంలో అలసత్వం ప్రదర్శించడం వల్ల మార్చి 16న ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఎక్కడ నిధులు అక్కడే నిలిచిపోయాయి. ఎన్నికల నోటిఫికేషన్‌కు బటన్ నొక్కిడానికి సుమారు వారం రోజులు వ్యవధి ఉన్నప్పటికీ మహిళల ఖాతాల్లో డబ్బులు జమ చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ఎన్నికల ముందు డబ్బులు జమచేస్తామని ప్రభుత్వం చెప్పినా కోడ్ ఉల్లంఘన కింద వస్తుందని ఇసి అడ్డుపడింది. ఎన్నిక జరిగిన తరువాత డబ్బు జమ చేసుకోవచ్చునని స్పష్టం చేసింది. ఎన్నికలు జరిగి సుమారు వారం రోజులు కావస్తున్నా ఇంత వరకూ ప్రభుత్వం ఆ నిధులపై స్పందించలేదు. దీంతో మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవ్వాలనుకుంటే ఇవ్వాలి తప్ప ఇలా ఇబ్బందులు పెట్టడమేంటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం మారితే తప్ప ఆ సొమ్ము మహిళల ఖాతాల్లోకి రాదన్న వాదన వినిపిస్తుంది.